ఘనంగా ఈద్ ఉల్ ఫితర్


కెరమెరి: సుల్తాన్‌గూడ ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంతో పాటు మండలంలో మంగళవారం ఈద్ ఉల్ ఫితర్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే పట్టణంలోని ఆయా కాలనీల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఉదయం 9 గంటలకు స్థానిక ఖదీం ఈద్గాలో జామా మసీదు ఇమామ్ మౌలానా ఇంతెఖాబ్ ఆలం ఆధ్వర్యంలో ప్రత్యేక సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. వేలాది మంది ముస్లింలు ఈద్గాకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పట్టణంలోని ఖదీం మసీదు, కౌసర్ మసీదు, నూరాని మసీదు, మెరాజ్ మసీదు, అన్సార్ మసీదు తదితర మసీదులలో సైతం నమాజ్ చేపట్టారు. నమాజ్ అనంతరం ఈద్గా ఎదుట టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, కోనేరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోనేరు వంశీ, బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సిడాం గణపతి, బీఎస్పీ తాలుకా ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్‌లు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అదనపు ఎస్పీ అచ్చేశ్వర్ రావు ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ డీఎస్పీ ఎ. కరుణాకర్ పర్యవేక్షణలో పట్టణ సీఐ బుద్దే స్వామి, ఎస్సైలు చంద్రశేఖర్, అంజయ్యలు ఈద్గా వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. కాగజ్‌నగర్ మండలం చింతగూడ (కోయవాగు) ఈద్గాలో సైతం ముస్లింలు ఈదుల్ ఫితర్ నమాజ్ చేపట్టారు. జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు కోయవాగు ఈద్గా వద్దకు చేరుకొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని ముస్లింలు శనివారం పవిత్ర రంజాన్ పండగను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు గోలేటి టౌన్‌షిప్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలోని ఈద్గా వద్ద రెబ్బెన సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేష్, ఎంపీటీసీ పెసరు మధునయ్య, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యురాలు కుందారపు శంకరమ్మ, బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్ తదితరులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి రంజాన్ పండగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలకు చెందిన ముస్లింలు ఈద్గాకు చేరుకుని నమాజ్ నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు చౌదరి తిరుపతి, నగునూరి శ్రీనివాస్‌లు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

కెరమెరి: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని ముస్లింలు ఈదుల్ ఫితర్‌ను ఘనంగా జరుపుకున్నారు. సుర్దాపూర్, కెరమెరి, సుల్తాన్‌గూడకు చెందిన ముస్లింలు సుల్తాన్‌గూడలోని ఈద్గాకు చేరుకుని ప్రత్యేక నమాజ్ చేశారు. వైస్‌ఎంపీపీ అబ్దుల్ కలాం, ఎంపీటీసీ ఇఫ్తేకార్, ఉప సర్పంచ్ నిసార్, పెద్దలు సుజాయిత్ ఖాన్, శేక్ యూనూస్, సదర్ యూసుఫ్, రజాక్, ఇలియాజ్, శంశుఖాన్, జాహెద్‌ఖాన్, ఫరీద్, ముజు, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ విందులో కోవ లక్ష్మి

మండల కేంద్రంలో వైస్‌ఎంపీపీ అబ్దుల్ కలాం, మైనార్టీ నాయకుడు షేక్ యూనూస్ ఇంట్లో ఏర్పాటు చేసిన రంజాన్ విందులో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

దహెగాంలో..

దహెగాం: మండల కేంద్రంతో పాటు బీబ్రా, కోత్మీర్, మొట్లగూడ, లగ్గాం తదితర గ్రామాల్లో శనివారం రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలో ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో రంజాన్ పండగ వేడుకలు నిర్వహించారు. స్థానిక మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మతపెద్దలు ఖురాన్ ప్రవచనాలు వినిపించారు.


కెరమెరి: శుభాకాంక్షలు తెలుపుతున్న కోవ లక్ష్మి


దహెగాం: బీబ్రాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


రెబ్బెన: ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు


జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో..


కెరమెరి: ఈద్ ముబారక్ చెప్పుకుంటున్న చిన్నారులు


కౌటాలలో..


కాగజ్‌నగర్‌టౌన్: ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే


పెంచికల్‌పేట్‌లోని ఈద్గా వద్ద రంజాన్ వేడుకలు నిర్వహిస్తున్న ముస్లింలు


కాగజ్‌నగర్‌టౌన్: కోయవాగు ఈద్గా వద్ద ముస్లింలతో జెడ్పీ వైస్‌చైర్మన్


రెబ్బెన: శుభాకాంక్షలు తెలుపుతున్న సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేష్‌లు

క్లుప్తంగా

'బూత్ కమిటీలతో బలోపేతం'

కెరమెరి: బూత్ కమిటీలతో పార్టీ మరింత బలోపేతమవుతుందని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు రాథోడ్ సాగర్ అన్నారు. శనివారం మండలంలోని సాంగ్వి, కెలిబి గ్రామాల్లో బూత్ స్వశక్తి అభియాన్ కమిటీలు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఇక నుంచి అన్ని గ్రామాల్లో బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, విజయశేఖర్, నాను, మెంగు, మనోహర్, రవీందర్, సాయినాథ్, విఠల్, వెంకటి తదితరులు ఉన్నారు.

రూ.270 కూలి పడేలా పని చేయాలి


కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో మల్లయ్య

కెరమెరి: ఉపాధిహామీ పథకంలో పనులు చేసే కూలీలు ప్రతీరోజు రూ.270 కూలి పడేలా పనులు చేయాలని ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. శనివారం మండలంలోని జోడేఘాట్‌లో ఉపాధి కూలీలతో మాట్లాడారు. ప్రతీ కూలీ వంద రోజులు పని చేస్తే సుమారు రూ. 27వేల వరకు సంపాదించవచ్చన్నారు. రాబోవు కాలంలో రెగ్యులర్ పనులు చేసే కూలీలకే జాబ్‌కార్డులు అందే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట సర్పంచ్ సోనిబాయి, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్ ఉన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కౌటాల: బ్యాంకు ఖాతాదారులు బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కౌటాల ఎస్‌బీఐ మేనేజర్ కొత్తూరి విష్ణు అన్నారు. ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని మొగడదగడ్‌లో ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పించారు. సిబ్బంది మోరేశ్వర్, మనీష్, నాయకులు బాజీరావ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్సై రమేశ్


యువకుడిని ఆసుపత్రికి తరలిస్తున్న ఎస్సై

తిర్యాణి: దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న యువకుడిని తన సొంత ఖర్చులతో ఆసుపత్రికి తరలించి ఎస్సై రమేశ్ మానవత్వం చాటుకున్నారు. మండలంలోని కర్పతిగూడ గ్రామానికి చెందిన రమేశ్ అనే యువకుడు కొన్నేళ్లుగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఎస్సై శనివారం యువకుడి ఇంటికి వెళ్లి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. అనంతరం యువకుడి తల్లి వృద్ధురాలు కావడంతో 25కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం : విరూపాక్ష

కాగజ్‌నగర్

వెంకటరమణ : విరూపాక్ష

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	60
దోసకాయ	50
చామగడ్డ	60
వంకాయ	60
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
రతాళం	60
గోబి(పూల్)	80
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్

వీవోఏల సమ్మె శిబిరంలో లెనిన్ జయంతి

కాగజ్‌నగర్‌టౌన్: తమ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఐకేపీ వీవోఏల సమ్మె శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమ్మె శిబిరంలో లెనిన్ 153వ జయంతి జరుపుకున్నారు. కార్యక్రమంలో వీవోఏలు, సీఐటీయూ నాయకుడు ముంజం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న అనిల్‌గౌడ్

రెబ్బెన: మండలంలోని నంబాల గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధితుడు పూదరి రాజయ్యకు శనివారం అనిల్ అన్న యువసైన్యం ఫౌండేషన్ చైర్మన్ జువ్వాజీ అనిల్‌గౌడ్ మానవత్వంతో ఆర్థిక సాయం అందజేశారు. శనివారం నంబాలకు వచ్చిన ఆయన కాలిపోయిన ఇంటిని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రూ.10వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సురేందర్ రాజు, నాయకులు దేవరకొండ సంతోష్, తిరుపతి, సురేష్, సంజయ్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉద్యోగికి సన్మానం


ఉద్యోగిని సన్మానిస్తున్న సిబ్బంది

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా ఎస్అండ్‌పీసీ డిపార్టుమెంట్‌లో క్లర్కుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న రాముని శనివారం గోలేటి 1 గనిపై తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్అండ్‌పీసీ సిబ్బంది మాట్లాడుతూ తమతో పాటు ఒకే విభాగంలో పని చేసిన ఉద్యోగి బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్తుండడంతో కుటుంబ సభ్యుడిని వీడుతున్నామనే భావన ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్అండ్‌పీసీ సిబ్బంది మల్లేష్, ఆర్గనైజేషన్ కమిటీ మెంబర్ రవీందర్, శ్రీనివాస్, గోర్ల శ్రీనివాస్, రాజయ్య, మంగీలాల్, చంద్రశేఖర్, కిష్టస్వామి, అనిల్‌కుమార్, రమేశ్ పాల్గొన్నారు.

బిగపట్టాల్సిందే..!

ఆశ్రమ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో విద్యార్థినులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా సరిపడా మరుగుదొడ్లు లేకపోవడం, కొత్త మరుగుదొడ్లు నిర్మాణ దశలోనే ఉండడంతో వారు పడుతున్న అవస్థలు వర్ణణాతీతంగా ఉన్నాయి. కనీసం ఈ ఏడాది వేసవి సెలవుల్లోనైనా మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలని విద్యార్థినులు కోరుతున్నారు.


మోడి ఆశ్రమ ఉన్నత పాఠశాల


నల్లాలు బిగించని టాయిలెట్


నిలిచిపోయిన కొత్త టాయిలెట్ల నిర్మాణ పనులు

- సరిపోని మరుగుదొడ్లు
- 542 మంది బాలికలకు 18 టాయిలెట్స్
- నిలిచిపోయిన కొత్త టాయిలెట్స్ నిర్మాణ పనులు
- విద్యార్థినులకు తప్పని తిప్పలు

కెరమెరి: మోడి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల సమస్యలకు నిలయంగా మారింది. అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మాటలు చెప్పే ఐటీడీఏ అధికారులు వారి బాగోగుల గురించి పట్టించుకోవడం లేదు. దీంతో విద్యార్థినులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు. మండలంలోని మోడి గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 3 నుంచి 10 వరకు తరగతులు కొనసాగుతున్నాయి. పాఠశాలలో మొత్తం 542 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. కాని పాఠశాలలో కేవలం 18 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. వాస్తవంగా 10 విద్యార్థినులకు ఒకటి చొప్పున టాయిలెట్ ఉండాల్సి ఉండగా ఉన్న వాటితోనే కాలం వెళ్లదీస్తున్నారు. తమ బాధను ఎవరికి చెప్పుకోలేక బాలికలు కుమిలిపోతున్నారు.

నిలిచిన పనులు..

ఆరేళ్ల క్రితం 18 మరుగుదొడ్లు, ఆరు స్నానపు గదులు విద్యార్థినులకు, రెండు మరుగుదొడ్లు సిబ్బంది కోసం ప్రత్యేకంగా మంజూరయ్యాయి. వాటిల్లో టైల్స్, షీట్స్ సైతం అమర్చారు. కాని నల్లాలు బిగించడం మరిచిపోయారు. నిధులు కొరత వల్ల పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టలేక పోయినట్లు సమాచారం. గతంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో రూ.10 లక్షల నిధులు విడుదల చేశారు. కాని నిర్మాణానికి మరో రూ. 5 లక్షలు నిధులు కావాల్సి ఉంది. నిధులు విడుదల అయితే తప్పా పనులు పూర్తయ్యే అవకాశం లేదు. డీఈ నజిమోద్దీన్‌ను వివరణ కోరగా చిన్నచిన్న పనులు మిగిలి ఉన్నాయని, మరో ఐదు రోజుల్లో పనులన్నీ పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



ప్రస్తుతం మా పాఠశాలలో కేవలం 18 మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉన్నాయి. విద్యార్థినులు ఎక్కువ మంది ఉండడంతో చాలా ఇబ్బంది అవుతుంది. నూతనంగా నిర్మిస్తున్న మురుగుదొడ్ల నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. వాటిని త్వరగా పూర్తి చేయాలి.

– ఎం. పరమేశ్వరి, 8వ తరగతి

'మధ్యాహ్న' కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కెరమెరి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు క్రిష్ణమాచారి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలోనే వేతనాలు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటివరకు పెరిగిన వేతనాలు అందలేదన్నారు. నెలల తరబడి ఎండీఎం బిల్లులు అందక పోవడంతో ఎండీఎం కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు జిల్లాలోని ఎండీఎం కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమా పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. ఆదే తుకారాం, గౌరుబాయి, లింగబాయి, సర్జుబాయి, సోంబాయి, గంగాదేవి, భీంబాయి ఉన్నారు.


మాట్లాడుతున్న క్రిష్ణమాచారి

సీపీఆర్‌పై వైద్య సిబ్బందికి శిక్షణ

నార్నూర్: వయస్సుతో సంబంధం లేకుండా చాలా మంది గుండెపోటు బారిన పడుతున్నారని, వారికి సకాలంలో సీపీఆర్ చేస్తే బతికించుకునే అవకాశం ఉంటుంది. అందుకే సీపీఆర్‌పై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నిర్ణయించింది. జిల్లాలో గత వారం రోజులుగా పీహెచ్‌సీల వారిగా వైద్య సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్నారు. సీపీఆర్ జిల్లా శిక్షణ అధికారి మనోహర్ ఆధ్వర్యంలో వైద్యులు ప్రతాప్, సాగర్, కిరణ్, వంశీ, హరీశ్ ఇప్పటికే హైదరాబాద్‌లో శిక్షణ పొందారు. ప్రతిరోజు వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు.

తైబజార్ వేలం

నార్నూర్: గాదిగూడ మండలంలోని లోకారి(కె) గ్రామ పంచాయతీ పరిధిలోని తైబజార్ వేలంను శనివారం సర్పంచ్ మెస్రం దేవురావు సమక్షంలో పంచాయతీ కార్యదర్శి మెస్రం విజయ్ నిర్వహించారు. మొత్తం 10 మంది పాల్గొన్నారు. లోకారి గ్రామానికి చెందిన సీడాం అంబురావు రూ. 1, 30 లక్షలకు దక్కించుకున్నాడు.

24, 25న దివ్యాంగులకు ఉచిత బస్ పాస్‌లు పంపిణీ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ఈ నెల 24, 25న దివ్యాంగులకు ఉచితంగా బస్‌పాస్‌లు పంపిణీ చేయనున్నట్లు మంచిర్యాల డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా పాసులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

జీవన్ ప్రమాణ పత్రాలు సమర్పించాలి

ఆసిఫాబాద్: జిల్లాలోని విశ్రాంత ఉద్యోగులు కుటుంబ పెన్షన్‌దారులు జీవన్ ప్రమాణ పత్రాలు సమర్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కర్నాగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.